


నేడు యుపిఎస్సీ మెడికల్ కంబైన్డ్ పరీక్షలు : డిఆర్ఓ

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ఈనెల 15న ఆదివారం యూపీ ఎస్సీ మెడికల్ కంబైన్డ్ పరీక్షలు జిల్లా కేంద్రంగా రెండు పరీక్షాకేంద్రాలలో 659మంది అభ్యర్థులు హాజరు కానున్నారని డిఆర్ఓ కోదండ రామిరెడ్డి తెలిపారు. శనివారం ఉదయం స్థానిక ఆర్‌డిఓ కార్యాలయంలో పరీక్షల నిర్వహణపై డిఆర్ఓ పరీక్షల లైజన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. డిఆర్ఓ మాట్లాడుతూ రెండు కేంద్రాలుగా నిర్వహించనున్న ఈ పరీక్షలు శ్రీపద్మావతి మహిళా డిగ్రీ, పిజి కళాశాల వింగ్ ఏ, బిలో నిర్వహణ ఉంటుందని అన్నారు. రెండు సెషన్స్‌లో ఉదయం 9.30 నుండి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు జరగనున్నాయని విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలి, రవాణా సౌకర్యం వంటివి అభ్యర్థులకు కల్పించాలని సూచించారు. సమీక్షలో పోలీస్, రెవెన్యూ, ఆర్‌టిసి, వైద్యశాఖల అధికారులు పాల్గొన్నారు.

కల్తీ దరువు.. నిఘా కరువు

- అడుగడుగునా కల్తీ ఆహారం విక్రయం
- నిల్వ పదార్థాలను వేడి చేసి అమ్మకాలు
- కొని తెచ్చుకుంటున్న అనారోగ్యం
- చర్యలు తీసుకోని ఫుడ్‌సేఫ్టీ అధికారులు
- గూడూరు ప్రజల ఆగ్రహం



ప్రజాశక్తి-గూడూరు:

అధికారుల నిర్లక్ష్యం.. ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుంటున్న వ్యాపారులు కల్తీ ఆహారం విక్రయాలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఎందెందు వెతికినా అందందు కలదన్నట్టు జోరుగా కల్తీ ఆహారం విక్రయాలు జరుగుతున్నాయి. వ్యాపారులకు డబ్బు సంపాదనే ప్రధానం. ప్రభుత్వ నిబంధనలు వారికి పట్టవు. తెలిసినా పట్టించుకోరు. ఇలా చేయడం తప్పు అని చెప్పాల్సిన అధికారులు నాలుగు డబ్బులు చేతిలో పడేసరికి చూసీచూడనట్లు వెళ్లిపోతారు. ఫలితంగా ప్రజారోగ్యం గుల్ల అవుతోంది. గూడూరు పట్టణంలో అధికారులు నిద్రపోతున్నారు.

కొందరు అధికారులు మామూళ్లకు తెగబడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. రెస్టారెంట్లు, బిర్యానీ సెంటర్లు, హోటళ్ల ఏర్పాటు చేయాలంటే ఫుడ్ సేఫ్టీ స్టాండర్స్ అథారిటీ ఆఫ్ ఇండియా లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలి. లైసెన్స్ లేకపోతే తనిఖీల్లో దొరికినప్పుడు సెక్షన్ 63 ప్రకారం ఫుడ్ సేఫ్టీ కమిషన్ ద్వారా క్రిమినల్ కేసులు ఫైల్ చేస్తారు. నేరం రుజువైతే 6 నెలల జైలు శిక్షతో పాటు రూ.5 లక్షల జరిమానా విధిస్తారు. ఆహార పదార్థాల తయారీకి టేస్టింగ్ సాల్ట్ (చైనా సాల్ట్) వాడకూడదు. రోజువారీ వాడే ఉప్పునే వాడాలి. ఈ నిబంధనలను హోటల్లో, రెస్టారెంట్లు యాజమాన్యాలు పాటించడం లేదు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. వంట వండే వ్యక్తి, వడ్డించే వ్యక్తులకు సంబంధిత హోటల్ యజమాని డాక్టర్ సర్టిఫికెట్ తప్పనిసరిగా తీసుకోవాలి. గూడూరు పట్టణంలో ఇవి చాలా చోట్ల అమలు కావడం లేదని ప్రజలు అంటున్నారు. పెద్ద హోటళ్లు, కొన్ని రెస్టారెంట్లు వాటిల్లో పరిశుభ్రత పాటించడం లేదని ప్రజలు వాపోతున్నారు. మిగిలిన ఆహార పదార్థాలను ఫ్రిజ్‌లో ఉంచి మరుసటి రోజు విక్రయిస్తున్నారు. మాంసం సైతం ఇదే విధంగా ఫ్రిజ్‌లో ఉంచి వండుతున్నారు. విషయం మున్సిపల్ అధికారులు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు నిర్వహించిన దాడుల్లో బహిర్గతమైంది. మాంసపు ఆహార పదార్థాలు గూడూరు పట్టణంలో నాన్వెజ్ హోటళ్లలో కుళ్లిన మాంసం బిర్యాని విక్రయాలు జోరుగా సాగుతున్నాయని ప్రజలు అంటున్నారు. రాత్రి పది, పదకొండు గంటల వరకు మటన్, చికెన్ ఆహార పదార్థాలు, బిర్యాని మిగిలిన వాటిని ఫ్రిజ్లో భద్రపర్చి తెల్లవారు దానినే మాంసం, చికెన్ బిర్యాని విక్రయాలకు ఉంచుతున్నారు అన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాన్వెజ్ హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు, మున్సిపల్ సానిటైజ్ అధికారులు తనిఖీలు చేసిన దాఖలాలు కనిపించడం లేదు. దీంతో నాన్ వెజ్ హోటళ్లలో ఆడిందే ఆట పాడిందే పాటగా తయారైంది.

రకరకాల పేరిట బిర్యాని, చికెన్, మటన్ హోటళ్లు కాకుండా కాలేజీల్లో ఫుడ్ కోర్టులు జోరుగా వెలుస్తున్నాయి. కల్తీ నూనె, కల్తీ మాంసం, కల్తీ ఆహార పదార్థాలతో రకరకాల పేరిట మటన్, చికెన్ బిర్యాని ఉంచుతున్నారు. గూడూరు పట్టణంలో పలు హోటళ్లలో ఈ తతంగం కొనసాగుతున్నప్పటికీ ఏనాడు అధికారులు ఈ హోటల్లో తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. ప్రస్తుతం ఉన్న మున్సిపల్ అధికారులు గాని, ఫుట్ సేఫ్టీ అధికారులుగాని తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. ఎమర్జెన్సీ సేవలు మాదిరిగానే హోటళ్లలో ఫోన్ ద్వారా ఆన్లైన్‌లో బిర్యాని, మటన్, చికెన్ పార్శిళ్ల ఇంటికే చేరవేస్తున్నారు.

చిన్నా పెద్దా హోటళ్లు, రెస్టారెంట్లు, డాబాలు, చాట్, నూడుల్స్ షాపులు అన్ని కలుపుకుని కొన్ని వందలకు పైగా ఉన్నాయి. వీటితో ప్రతి సంవత్సరం కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతోంది. అధికారులు పర్యవేక్షణ చేస్తే ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడొచ్చు అని ప్రజలు వాపోతున్నారు. అధిక శాతం మురుగునీటి కాలువలు, చెత్తకుప్పల పక్కనే నిర్వహిస్తున్నా అడిగే నాథుడు కరువయ్యారు. గూడూరు పట్టణంలో వందలాది హోటళ్లు, దుకాణాలు, టిఫిన్ సెంటర్లు, రెస్టారెంట్లు, గూడూరులో చిన్నా పెద్దా హోటళ్లు, రెస్టారెంట్లు, డాబాలు, చాట్, నూడుల్స్ షాపులు అన్ని కలుపుకుని కొన్ని వందలకు పైగా ఉన్నాయి. వీటితో ప్రతి సంవత్సరం కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతోంది.

ఆహారం కల్తీతో అనారోగ్యం

పాలల్లో చిక్కదనం కోసం నాసిరకం పాలపౌడర్లు, యూరియా, పిండి, నూనె, నీళ్ల కలిపి విక్రయిస్తున్నారు. ఇనుప రజను, రంపపు పొట్టును టీ పొడిలో కలపడంతో ఊపిరితిత్తులు పాడై పోయే ప్రమాదం ఉంది. జంతువుల కళేబరాల నుంచి సేకరించిన ఎముకలను బట్టీల్లో అత్యధిక ఉష్ణోగ్రతపై మరిగించి తీసిన ద్రావణాన్ని వంట నూనెల్లో కలిపి విక్రయిస్తున్నారు. దీంతో జీర్ణకోశ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. ఆరోగ్యకరమైన జంతు మాంసాన్ని 24 గంటల్లోపే వినియోగించాలి. చాలా హోటళ్లలో చనిపోయిన జంతువుల మాంసాన్ని, ఎక్కువ కాలం నిల్వ ఉంచిన మాంసాన్ని విక్రయిస్తున్నారు. చికెన్, మటన్ బిర్యానీలు, తందూరి చికెన్‌లలో కస్టమర్లను ఆకట్టుకునేందుకు ఎక్కువగా హానికర రంగులు వాడుతున్నారు. మిరపకాయల్లో ఎరుపు రంగు రావడానికి సూడాన్ రంగులు వాడుతుంటారు. పసుపులో మెటానిల్ ఎల్లో అనే పదార్థాన్ని కలుపుతారు. వీటిని వంటలో వినియోగిస్తే క్యాన్సర్ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. ఆహారాన్ని వండే సమయంలోనూ వండిన నూనెనే మళ్లీ మళ్లీ కాచి వండుతున్నారు. దీంతో క్యాన్సర్, అల్సర్లు వచ్చే ప్రమాదముంది. చిన్న చిన్న హోటళ్లు, కర్రీపాయింట్లలో వేడి వేడి కూరలు, పప్పు, సాంబారు వంటి ఆహార పదార్థాలు పల్చటి పాలిథిన్ కవర్లలో వేసి ఇస్తున్నారు. పదార్థాల వేడికి ప్లాస్టిక్ కరిగిపోయి తిన్న తర్వాత అనారోగ్యాన్ని కలిగిస్తాయి. షుగర్ లెస్ స్వీట్లలో అధికంగా సాక్రిన్ వాడుతుండటంతో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. అల్లం, వెల్లుల్లి పేస్టులలో ఆలుగడ్డ, ఉల్లిగడ్డ పేస్టును కలుపుతున్నారు. అన్ని రకాల పండ్లను ఆకర్షణీయంగా కనిపించేందుకు కార్బైడ్‌తో హానికారక రంగులు, జిగురు యథేచ్ఛగా వాడుతున్నారు. దీంతో కాలేయ సమస్యలు, కడుపునొప్పి, నిద్రలేమి, కిడ్నీ వంటి అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తనిఖీలు నిర్వహించి ప్రజలను రోగాల నుంచి కాపాడాలని గూడూరు పట్టణ ప్రజలు కోరుతున్నారు.

రాజకీయ చైతన్యంతోనే దేశాభివృద్ధి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్



సిపిఎం శిక్షణా తరగతుల్లో ప్రసంగిస్తున్న వి రాంభూపాల్

ప్రజాశక్తి- పుత్తూరు టౌన్: రాజకీయ చైతన్యంతోనే దేశఅభివృద్ధి సాధ్యమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు వి.రాంభూపాల్ పేర్కొన్నారు. జిల్లానాయకత్వ శిక్షణా తరగతులు పుత్తూరు పట్టణంలో శనివారం ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణా తరగతులకి ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు వి.రాంభూపాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ సంస్థలన్నింటిని నిర్వీర్యం చేస్తూ కార్పోరేట్ కంపెనీలకు దేశ సంపదను అప్పగించేలా అత్యంత ప్రమాదకరమైన చట్టాలను కేంద్ర తీసుకునివచ్చి ప్రభుత్వ సంస్థలు అమ్మివేస్తున్నదని వీటిని అడ్డుకోవాలంటే సిపిఎం కార్యకర్తల ద్వారా సాధ్యమవుతుందని, అందుకు తగిన రాజకీయ, సామాజిక చైతన్యం కార్యకర్తలు కలిగి ఉన్నప్పుడే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. దేశంలో ఏరాష్ట్రంలో లేనివిధంగా అధికారపార్టీ, ప్రతిపక్ష పార్టీ రెండు కూడా బిజెపి వినాశకరమైన విధానాలకు పార్లమెంట్ లోపల మద్దతిస్తున్నాయని తెలిపారు. గత తొమ్మిది సంవత్సరాల కాలంలో ఎనిమిది విమానాశ్రయాలు, పన్నెండు పోర్ట్ లు, ఇరవై నాలుగు వేల కిలోమీటర్ల జాతీయ రహదారులను గౌతమ్ అదానికి కేంద్ర అప్పగించిందని, మరోవైపు టెలికాం, సహజవాయువు ఉత్పత్తులన్నింటిని రిలయన్స్ కంపెనీకి అప్పగిస్తే ఇంత దారుణంగా బిజెపి ప్రయివేటీకరణ చేస్తే దేశభవిష్యత్తు అంధకారంలోకి నెట్టివేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు వ్యక్తిగత విమర్శలు ప్రక్కన పెట్టి, ఈ రాష్ట్రానికి రావాల్సిన హక్కుల సాధనకు కలిసి రావాలని కోరారు. ఈ శిక్షణా తరగతులలో సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి, అంగేరి పుల్లయ్య, దాసరి జనార్ధన్, టి.సుబ్రమణ్యం, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.వెంకటేష్, మాధవ్, సాయిలక్ష్మి, హరినాథ్ శాఖా కార్యదర్శులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న నటుడు సాయి ధర్మతేజ్

ప్రజాశక్తి-తిరుమల: తిరుమల శ్రీవారిని సినీనటుడు సాయిధర్మతేజ్ దర్శించుకున్నారు. శనివారం వీఐపీ ప్రారంభ విరామదర్శన సమయంలో నటుడు నిర్మాత సముద్రఖనితో కలిసి స్వామివారి సేవలో తేజ్ పాల్గొన్నారు. టిటిడి ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం గర్భాలయంలో స్వామివారిని దర్శించుకొని స్వామివారికి సాయిధర్మ తేజ్ మొక్కులు చెల్లించారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను వారికి అందజేశారు. నాప్రతి చిత్రం విడుదలకు ముందు శ్రీవారిని దర్శించుకుంటానని, గత చిత్రం విడుదలకు ముందు బిజీ షెడ్యూల్ ఉండటంతో రాలేకపోయన్నారు. బ్రో చిత్రంలో పవర్ స్టార్ పవన్ కల్యాణ్ చాలా అద్భుతంగా నటించారని, చిత్ర విజయ మహోత్సవంలో కలుస్తామని దర్శకుడు సముద్రఖని తెలిపారు.

శ్రీనివాస సేతుపై డెక్ స్లాబ్ పనులు చేపట్టండి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్



తిరుపతి శ్రీనివాస సేతు ప్రాజెక్టు రైల్వే వంతెనపై జరుగుతున్న నిర్మాణ పనులను తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత శనివారం పరిశీలిస్తూ డెక్‌స్లాబ్ పనులను చేపట్టాలని సూచించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆగస్ట్ మొదటి వారంలోపు శ్రీనివాససేతు పనులు మొత్తం పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. రైల్వేఓవర్ బ్రిడ్జి పైన ఇప్పటికే మొత్తం ఆరు గెడ్డెర్లను అమర్చే ప్రకియ పూర్తి అయ్యిందని, గెడ్డెర్లపై డెక్‌స్లాబ్ వేసిన అనంతరం దానిపై రోడ్డు వేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఆర్వోబిపై రెండు వైపులా వున్న స్పాన్స్‌పై సెగ్మెంట్స్ ఏర్పాటు చేసే ప్రకియ జరుగుతున్నదన్నారు. అధికారులకు సూచనలు చేస్తూ శ్రీనివాససేతు తుది దశ పనులను నిత్యం పర్యవేక్షణ చేస్తుండాలని, పనులను వేగవంతం చేసి ఆగస్టు మొదటి వారంలోపు పనులు పూర్తి అయ్యేటట్లు చూడాలని తెలిపారు. కమిషనర్ వెంట మునిసిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, ఆఫ్కాన్ ప్రతినిధి స్వామి, ఏయికామ్ ప్రతినిధి బాలాజీ ఉన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందాలి

డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలనే నియోజకవర్గ సమీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి, చంద్రగిరి శాసనసభ్యులు చెవిరెడ్డి భాస్కరరెడ్డి తెలిపారు. శనివారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్‌లో నియోజవర్గ సమీక్షలో భాగంగా మొదటిసారిగా చంద్రగిరి నియోజకవర్గ సమీక్ష డిప్యూటీ సీఎం, చంద్రగిరి శాసన సభ్యులు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి, జేసి డికె బాలాజీ, చంద్రగిరి స్పెషల్ ఆఫీసర్ లక్ష్మి, డిఆర్ఓ కోదండరామిరెడ్డి జిల్లా, మండలస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు వివరాలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించగా డిప్యూ టి సిఎం, ఎంఎల్‌ఏ కలసి సమీక్షించి సూచనలు ఇచ్చారు. చంద్రగిరి నియజకవర్గంలో 29,818 మంది రైతులకు ప్రతి ఏటా రూ.38 కోట్లమేర లబ్ధికలుగుతున్నదని, భూమి కలిగి పాస్‌బుక్ లేని వారికి త్వరగా పరిష్కరించాలన్నారు. యంత్రసేవా పథకం 66 అన్ని ఆర్‌బికె ఏర్పాటు చేయాలని, ఎరువులు, పురుగుమందులు సకాలంలో అందించే విధంగా ఉండాలని, అలాగే డ్రిప్ ఇరిగేషన్ పెంచాలన్నారు. సౌత్ ఏషియలో మాంగో మార్కెట్ పెద్దది అని, డ్రిప్ ప్రాముఖ్యత తెలియని రైతులు ఉంటారని కనుక అందరకీ అవగాహన కల్పించ్చి అందరికీ అందాలే చూడాలని సూచించారు. పశు వైద్యశాలలు రిపేర్లు ప్రతిపాదనలు అందించాలని, హార్టికల్చరల్ కు ప్రాధాన్యత కల్పించాలని, సిరికల్చర్ ప్రోత్సహించాలని సూచించారు. సంవత్సర పొడువునా నీరు వున్న చెరువుల్లో చేపల పెంపకం పెంచాలని, చెరువుల పునరుద్ధరణ కోసం డిపిఆర్ అందించాలని సూచించారు. ఉపాధి హామీ పథకం క్రింద 42 వేల మంది జాబ్ కార్డులు వున్నాయి. ఉపాధి కల్పించి పనిదినాలు కల్పించాలి, అవెన్యూ ప్లాంటేషన్ జరగాలన్నారు. సంపూర్ణ పోషణ ఆగస్టు నుండి ఇంటికే ఇచ్చే కార్యక్రమం మొదలవుతుందని సక్రమంగా అందించాలని సూచించారు. ప్రభుత్వ ఆసపత్రుల్లో వసతులు, వైద్య సేవలపై సమీక్ష,, నాడు-నేడు పిహెచ్‌సి భవనాల నిర్మాణాలు పురోగతి పై సమీక్షించారు. చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సమావేశంలో స్వర్ణముఖి నదిపై చిగురువాడ, తిరుచానూరు వంతెనల నిర్మాణం త్వరగా చేపట్టాలని కోరారు. ఈ సమీక్షలో ఆర్‌డిఓ కనక నరసారెడ్డి జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పెల్లుబికిన అంగన్‌వాడీల 'ఆక్రోశం'

ప్రజాదృష్టి

ప్రజాశక్తి- తిరుపతి సిటి

వారు ఊరు మధ్యన ఓ సెంటర్‌లో చంటిబిడ్డలకు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు యోగక్షేమాలు చూసుకుంటూ ఆటలు, పాటలు ద్వారా విద్యవైపు వారి గమ్యాన్ని మళ్లిస్తూంటారు. మధ్యాహ్నం నుంచి గర్భవతులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందిస్తూ, ప్రతి ప్రభుత్వపథకాన్ని ప్రజలకు దగ్గర చేస్తూ గ్రామంలో పెద్దక్క పాత్రను పోషిస్తారు. వారే అంగన్‌వాడీలు అది గతం మాట. ఇప్పుడు దీనికి అదనంగా యాప్‌లు, అప్‌లోడ్లు, ట్యాబ్‌లతో అదనపు భారం. ఇది చాలదన్నట్లు స్థానిక ప్రజాప్రతినిధి (సర్పంచ్, వార్డు మెంబర్లు) దగ్గర నుంచి, ఆఖరికి అధికార పార్టీ రాజకీయ నాయకుల వరకు వారిపై పెత్తనం చెలాయిస్తున్నారు. ఉదయం లేచింది మొదలుకుని, రాత్రి వరకు అన్ని పనులు వారిపైనే. దీనికి తోడు ఈ మధ్య కాలంలో ఫుడ్‌కమిషనర్ పోస్టుల ద్వారా తనిఖీల పేరుతో వారిని అవమానించడం షరా మామూలైంది. ఇప్పుడు వాలంటరీలు ఉన్నారు. గనుక సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేసేందుకు కాస్తంత వెసులుబాటు ఇచ్చినట్టే ఇచ్చే ఇతరాత్ర పనుల భారాన్ని మోపుతున్నారు. ఆఖరికి ఆరోగ్యం బాగులేక ఒక రోజు, ఒకపూట సెలవు పెడదామంటే నలుగురు పై అధికారులకు మెసేజ్‌లు పెట్టి, వారందరి అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితి. దీనికి తోడు అరకొర ఆహార పదార్థాలు పంపిణీ, నాణ్యతలేని సరుకులు సరఫరా.. ఎక్కడ ఏది లోపించిన, బాధ్యులు మాత్రం అంగన్‌వాడీలే. పైపెచ్చు సెంటర్ల నిర్వాహణకు చెల్లించాల్సిన డబ్బులు కూడా సక్రమంగా ఇవ్వడం లేదు. అంగన్‌వాడీలు తమ సొంత డబ్బులతో సెంటర్ల రెంట్ చెల్లిస్తున్న పరిస్థితులు. ఇంత చేస్తున్న వారికి



చీత్కరింపులు, చీవాట్లు తప్పడం లేదు. ఆఖరికి ఉద్యోగ భద్రత కూడా కరవైంది. చాలీచాలనీ వేతనాలు, పెరిగిన నిత్యావసర ధరలు వల్ల కుటుంబ పోషణ కష్టతరమవుతోంది. ఊరందరికి పౌష్టికాహారాన్ని అందించే అంగన్‌వాడీలు తమ కుటుంబానికి కనీసం పప్పన్నం పెట్టలేక అవస్థలు పడుతున్నారు. పైగా రాజకీయ వేధింపులు తాళ్లలేక అంగన్‌వాడీలు మానసిక, శారీరక రుగ్మతులకు గురవుతుండడం గమనార్హం. అలాంటి వారు అక్రోశంతో రోడ్డెక్కారు. అందుకు కారణం ఐసిడిఎస్ పరిరక్షణే. ఆహార్నిశలు శ్రమిస్తూ సమాజ శ్రేయస్సుకు కృషి చేస్తున్న తమ బతుకులను బాగు చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం చివరకు ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేయాలని కుట్రచేయడంతో, విధిలేని పరిస్థితుల్లో సమ్మెకు దిగారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న అంగన్‌వాడీ సమ్మెలో బాగంగా ఆంధ్రప్రదేశ్‌లో ఏపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సిఐటియు మద్దతుతో పోరుబాటపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ కార్యాలయాల వద్ద 36 గంటల మహాధర్నాకు పిలుపునిచ్చారు. పసిపిల్లలకు వంటచేసి వడ్డించే అంగన్‌వాడీలు నడిరోడ్డుపై వంటవార్పు చేశారు. గర్భవతులకు పౌష్టికాహారం అందించే పెద్దక్కలు చిమ్మచీకట్లో, దోమలు తమ రక్తాన్ని పీల్చుతున్నా వెరవక నిరసన నిద్ర చేపట్టారు. అటు గ్రామానికి, ఇటు కుటుంబానికి అన్ని తానై నిలిచిన వారు 36 గంటల పాటు అందర్ని వదిలి కలెక్టర్ కార్యాలయాలవద్ద పడిగాపులు కాశారు. ఇదంతా మణులు మాణిక్యాల కోసమే, రాజ్యాలు, రాజ్యాధికారాల కోసమో కాదు. పసిపిల్లలకు అన్నం పెట్టే తమ కుటుంబాలు పస్తులతో ఉండకుండా చూడమని, 12 సంవత్సరాలుగా నయాపైసా కూడా పెరగని తమ జీతాల్లో కాస్త కదలిక ఇవ్వాలని, ప్రతిపక్షంలో ఉన్నప్పడు ప్రస్తుత రాష్ట్ర పాలకులు ఇచ్చిన హామీని అమలు చేయమని, ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజలే ఎన్నుకోబడిన ప్రభుత్వాలు ప్రజాస్వామ్యాన్ని అనుచరించాలని, దేశానికి తలమానికంగా నిలిచిన దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయమని కోరుతూ రోడ్డుపైకి వచ్చారు. దీనికి పాలకులు ప్రతి స్పందన... పలు చోట్ల అక్రమ అరెస్టులు, నిర్బంధాలు, లాఠీచార్జీలు, దాడులు, దౌర్జనాలు. కొన్ని చోట్ల చూద్దాం.. పైవాళ్లకి చెబుదాం.. అనేలా అధికారులు తీరు కొట్టొచిన్నట్లు కనిపించింది. కనీసం మంత్రివర్గ సమావేశంలోనైనా తమకు కాస్త ఊరట కల్గించే నిర్ణయాలు ఉంటాయని బావించిన అంగన్‌వాడీలకు మరోసారి నిరాశ తప్పలేదు. ఏళ్లతరబడి ప్రభుత్వాల తీరుతో విసిగి వేజారిన అంగన్‌వాడీలు తమ ఆవేదనను మరింత గెట్టిగా వినిపించాలని బావిస్తున్నారు. రానున్న రోజుల్లో పాలకుల తీరుకు నిరసనగా పెద్దఎత్తున పోరాటాలు చేసైనా తమ న్యాయమైన కోర్కెలు పరిష్కరించుకోవాలని దీక్షభూనారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర పాలకులు మేల్కొని, భవిష్యత్తు తరాలకు సపర్యాలు చేసే అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించాలని పులువురు మేధావివర్గం, ప్రజాస్వామ్యవాదులు కోరుతున్నారు. పాలకులారా ఆలోచించించడి. ఆంగన్‌వాడీలను ఆదుకోండి.

జాతి నిర్మాతలు.. నేటి యువత : విసి భారతి

ప్రజాశక్తి - క్యాంపస్: జాతి నిర్మాతలు నేటి యువతీ, యువకులని పద్మావతి విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ భారతి అన్నారు. శనివారం మహిళా విశ్వవిద్యాలయం ఇందిరా గాంధీ ఆడిటోరియంలో కేంద్రప్రభుత్వ నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా యువఉత్సవం కనుల పండుగగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ నేటి యువతీ యువకులే రేపటి పౌరులని, దేశం కీర్తి పెంచాల్సిన బాధ్యత ప్రతిపౌరుని మీద ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ కాత్యాయిని మాట్లాడుతూ జాతి నిర్మాతలుగా ప్రతివిద్యార్థి ఎదగాలని సూచించారు. దేశంలో ప్రపంచంలో అత్యధిక యువశక్తి భారతదేశంలోనే ఉందని, ఇంతటి మానవరుల సంపద ఎక్కడా లేదని పేర్కొన్నారు. భారతదేశం కీర్తి ప్రతిష్టలు పెంచాలంటే అది యువతరం మీదే ఉందని తెలియజేశారు, అనంతరం ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నగర మేయర్ డాక్టర్ బిఆర్.శిరీష మాట్లాడుతూ జాతి నిర్మాతలు నేటి యువతీ, యువకులని అన్నారు. దేశం భవిష్యత్తు విద్యార్థుల మీద యువతరం మీద ఆధారపడి ఉందని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తమ జ్ఞానాన్ని సామర్థ్యాన్ని ప్రతిభని పంచుకొని దేశం కీర్తిని పెంచాలని సూచించారు. నెహ్రూ యువకేంద్రం ఇటువంటి పోటీలు పెట్టి విద్యార్థులలోని సజనాత్మక శక్తి యుక్తుల్ని వెలికితీస్తున్నందుకు అభినందించారు. యోగా ధ్యానం క్రీడలు సాంస్కృతిక పోటీలు వంటి వాటిలో ప్రతి విద్యార్థి పాల్గొని తమ ప్రతిభ చాటాలని సూచించారు .ఈ సందర్భంగా పంచప్రాన్ అంశాలుగా ఐదు విభాగాలుగా యువతీ యువకులకు విద్యార్థులకి పోటీలు నిర్వహించారు. నత్యం, కవిత్వం ,చిత్రలేఖనం మొబైల్, ఫోటోగ్రఫీ,



డిక్లమేషన్ వంటి అంశాల మీద పోటీలు నిర్వహించారు ఈ పోటీలలో సుమారు 420మంది యువతి, యువకులు పాల్గొన్నారు. యువఉత్సవానికి అతిధులుగా విచ్చేసిన నగర మేయర్ డాక్టర్ శిరీష, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సర్ డాక్టర్ భారతి విద్యార్థి విభాగం అధ్యక్షురాలు డాక్టర్ కాత్యాయని యోగా అసోసియేషన్ ఆఫ్ చిత్తూర్ శ్రీనివాసులు నాయుడు గురజాడ ఫౌండేషన్ అధ్యక్షులు పి.హరికష్ణరెడ్డి, మహర్షి అభ్యుదయ సేవాసంస్థ అధ్యక్షులు జ్ఞానశేఖర్ రెడ్డిలను ఘనంగా సత్కరించారు. విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ కి అలాగే నెహ్రూ యువ కేంద్రం వాలంటీర్స్‌కి జ్ఞాపికలు అందించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రశంసా పత్రాలు అందజేశారు. నెహ్రూ యువ కేంద్రం అకౌంట్ ఆఫీసర్ ఎంసి బాబురెడ్డి, యోగా గురువు బండికుమార్, న్యాయమూర్తులు డాక్టర్ నారాయణస్వామి, రఘుపతి సుమనశ్రీ, శ్రీనివాసులు, శ్రీనివాసరాజు, ఎంఎన్.రాజు, దుర్గ, షాజహాన్ నెహ్రూ కేంద్రం వాలంటీర్లు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

శ్రీవారి ఆశీస్సులతో

దేశవాళీ గోజాతుల అభివృద్ధి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో



దేశవాళీ గోజాతుల సంరక్షణ, అభివద్ధి కోసం శ్రీ వేంకటేశ్వర పశు వైద్య విశ్వవిద్యాలయంతో కలసి టీటీడీ చేపట్టిన ప్రాజెక్టు సత్ఫలితాలనిస్తోందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి చెప్పారు. శనివారం రాత్రి ఆయన ఎస్వీ గోసంరక్షణశాలను సందర్శించారు. పిండమార్పిడి ద్వారా ఇటీవల జన్మించిన ఆరు సాహివాల్ దూడలను ఆయన పరిశీలించారు. గోశాలలో గోజాతుల వసతి కోసం చేసిన ఏర్పాట్లను చూశారు. అనంతరం డాక్టర్ జవహర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. దేశీయ గోజాతుల సంరక్షణ, అభివద్ధి కోసం రెండు సంవత్సరాల క్రితం పశువైద్య విశ్వవిద్యాలయంతో టీటీడీ ఒప్పందం చేసుకుందన్నారు. ఇందులో భాగంగా ఉత్తర భారతదేశం నుంచి సాహివాల్, కాంక్రీజ్, ఘిర్ లాంటి మేలు జాతి గోవులను తీసుకుని వచ్చి ప్రత్యేక సాంకేతికతో పిండమార్పిడి చేసి దేశీయ గోజాతుల అభివద్ధికి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఈసాంకేతిక పరిజ్ఞానంతో 90 శాతం ఆడదూడలే జన్మిస్తాయని చెప్పారు. ప్రస్తుతం జన్మించిన ఆరు దూడల్లో ఒకటి మాత్రమే మగదూడ జన్మించిందన్నారు. సరోగసీ విధానం ద్వారా గర్భం దాల్చిన మరో 13 ఆవులు త్వరలో దూడలకు జన్మనివ్వబోతున్నాయని అన్నారు. తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారికి దేశీయ పాలతో కైంకర్యాలు, ప్రసాదాలు తయారు చేయడానికి కూడా చేపట్టిన ఈ ప్రయోగం స్వామివారి ఆశీస్సులతో సత్ఫలితాలనిస్తోందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అంతకుముందు ఆయన తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు డాక్టర్ జవహర్ రెడ్డి కి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. జేఈవోలు సదా భార్గవి, వీర బ్రహ్మం, పశువైద్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ పద్మనాభరెడ్డి, టీటీడీ గోసంరక్షణ ట్రస్ట్ సభ్యులు శ్రీ రామ్ సునీల్ రెడ్డి, గోశాల డైరెక్టర్ డాక్టర్ హరనాథ రెడ్డి, డిప్యూటీఈవో గోవిందరాజన్ పాల్గొన్నారు.

మంగళం ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం ప్రాంతాన్ని మరింతగా అభివృద్ధి చేసి చూపుతామని చంద్రగిరి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి అన్నారు. మంగళం పంచాయతీలో శనివారం ఆమె ఇంటింటికీ పాదయాత్రలో భాగంగా పద్మావతినగర్, క్రిష్ణవేణి యాదవ కాలనీలో పర్యటించారు. ఎమ్మెల్యేగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేసిన అభివృద్ధిని, కరోనా సమయంలో నియోజకవర్గ ప్రజలను కుటుంబ సభ్యులుగా భావించి తగిన సహాయ సహకారాలను అందించారని గుర్తు చేశారు. 2024 ఎన్నికల్లో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారని, ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చిలమంద మునిక్రిష్ణయ్య, మంగళం డివిజన్ వైసిపి అధ్యక్షులు ప్రళయకావేరి నారాయణరెడ్డి, మంగళం పంచాయతీ వైసిపి ఇన్‌ఛార్జి సి.హరిక్రిష్ణ, తిరుమలనగర్ పంచాయతీ వైసిపి ఇన్‌ఛార్జి గుండ్రాజు శివశంకర్‌రాజు, వార్డు సభ్యురాలు రాజ్యలక్ష్మి, దయాకర్, కన్నయ్య, పంచాయతీ కార్యదర్శి రాజేష్, ఏపీఎం గురునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస హైస్కూల్‌లో ఫ్రూట్స్ డే



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధి సప్తగిరి కాలనీలోని శ్రీనివాస హైస్కూల్‌లో శనివారం ఫ్రూట్స్ డే ను ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ సుబ్రమణ్యంరాజు, డైరెక్టర్ వి.మంజుల ఆధ్వర్యంలో విద్యార్థులకు పండ్లు కారణంగా శరీరానికి చేకూరే విటమిన్లు, ఫ్రూట్స్ డే గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తకనకదాసు విగ్రహ ఏర్పాటుకు సహకరించండి




ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుమల శ్రీవారికి పరమ భక్తుడైన శ్రీ భక్త కరకదాసు విగ్రహాన్ని అలిపిరి పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేయుటకు సహకరించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి తిరుపతి జిల్లా కురబ, కురమ, కురవ సంఘం గౌరవ అధ్యక్షులు రెడ్డికుమార్, అధ్యక్షులు మంగిరి రెడ్డెప్ప ఆధ్వర్యంలో శనివారం వినతి ఇచ్చారు. తమ సామాజిక వర్గానికి చెందిన వారు తిరుమల శ్రీవారి దర్శనార్థం వస్తుంటారని, బస చేసేందుకు భవనం నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ డీఎస్పీ నంజుండప్ప, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రేపు అంజుయాదవ్‌పై పవన్‌కళ్యాణ్ ఫిర్యాదు



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి జిల్లా ఎస్పీకి జనసేన నాయకులు కొట్టేసాయిపై శ్రీకాళహస్తి ఒకటో పట్టణ సీఐ అంజు యాదవ్ ప్రవర్తించిన తీరుపై వినతి ఇవ్వడానికి తిరుపతికి వస్తున్నారని పీఏసీ సభ్యులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనసేన కార్యకర్తలపై అకారణంగా దాడులు చేస్తే న్యాయపరంగా, రాజ్యాంగం పరంగా పోరాటాలు చేస్తూ కార్యకర్తలను కాపాడుకుంటామని చెప్పడానికే పవన్ వస్తున్నారన్నారు. ప్రశాంత వాతావరణంలో ఈ కార్యక్రమం జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కిరణ్‌రాయల్, రాజారెడ్డి, వినుత, కీర్తన, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాల పరిశీలన



ప్రజాశక్తి - గూడూరు రూరల్ : గూడూరు రెండో పట్టణ పరిధిలోని గాంధీనగర్‌లో ఉన్న టిడ్కో గృహాలను శనివారం జనసేన పార్టీ నాయకులు పరిశీలించారు. అక్కడ నివాసం ఉంటున్న ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జన సైనికులు నయీమ్, హసన్, ప్రసన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ప్రజారోగ్యం పదిలం





ప్రజాశక్తి-సత్యవేడు: చిరుధాన్యాలను రోజువారి ఆహారంగా తీసుకోవడంతో ప్రజల ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని వ్యవసాయశాఖ తిరుపతి జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య తెలిపారు. సత్యవేడు మండలం కన్నవరం గ్రామంలో చిరు ధాన్యాల సాగు వినియోగంపై ఆయన శిక్షణ ఇచ్చారు. గ్రామంలో సజ్జ సాగుకు నేలల వాతావరణం అనుకూలంగా ఉన్నాయని.. ఈ పంట సాగుకు ప్రభుత్వ సహాయ సహకారాలు అందిస్తుందని రైతులకు వివరించారు. సజ్జ పంట సాగు యాజమాన్యంపై వ్యవసాయ అధికారి వేణుగోపాలరావు రైతులకు వివరంగా తెలియజేశారు. రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పూర్ణచందు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధుల సమస్యలపై స్పందించాలి

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: సూళ్లూరుపేట మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీల పరిధిలోని గ్రామ సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చినప్పుడు వెంటనే స్పందించాలని, వాటిని పరిష్కరించి తెలియజేయాలని మండలాధ్యక్షుడు అల్లూరు అనిల్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల సమావేశంలో ఎంపీపీ పాల్గొన్నారు. ట్రాన్స్‌కో ఏఈ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో 24 గంటలు విద్యుత్ సరఫరా ఇవ్వడానికి ప్రభుత్వం ఆర్డీఎస్ అనే స్కీమ్ తీసుకొస్తుందని..గ్రామాలకు సైతం సరఫరా ఉంటుందని తెలియజేశారు. మండల సమావేశానికి అధికారులు నామమాత్రంగా హాజరు రావడంతో హాజరు కాని ప్రభుత్వ శాఖల అధికారులకు నోటీసులు పంపాలని ఎంపీపీ అనిల్ రెడ్డి ఆదేశించారు. సమావేశంలో తహశీల్దారు రవికుమార్, ఎంపీడీవో ప్రమీలరాణి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష.. పేదలకు రక్ష


గూడూరులో..


బాలాయపల్లిలో..


పుత్తూరులో...

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : జగనన్న సురక్ష పేద ప్రజలకు శ్రీ రామ రక్ష అని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వంప్రసాద్‌రావు పేర్కొన్నారు. శనివారం గూడూరు పట్టణంలోని అశోక్ నగర్ వార్డు సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గొని సర్టిఫికెట్‌లను అందించారు. వైసిపి పార్టీ సీనియర్ నాయకులు బత్తిన విజయ్ కుమార్ పట్టణ అధ్యక్షులు బొమ్మిడి శ్రీనివాసులు జె.సి.ఎస్ కన్వీనర్ రాఘవరెడ్డి అజీజ్ ఖాన్ ప్రసాద్ గౌడ్ సుబ్రమణ్యం ఆల్తాఫ్ సచివాలయం కన్వీనర్ కటకం శ్రీనివాసులు అమర్నాథ్ , పలువురు నాయకులు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాలాయపల్లి: ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు జగనన్న ప్రభుత్వం మాత్రమే అందిస్తోందని ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని జయంపు, నిడిగల్లు గ్రామాలలో జగనన్న సురక్ష గ్రామసభలు నిర్వహించారు. జయంపు పీఏసీఎస్ అధ్యక్షులు వెందోటి కార్తీక్ రెడ్డి, సర్పంచ్ సిద్దయ్య, ఎంపీటీపీ సుజాత, పంచాయతీ సెక్రెటరీ కృష్ణలీల, వీఆర్వో మేకాలయ్య, ఐసిడిఎస్ సిబ్బంది, గహ సారథులు, వివిధశాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్: జగనన్న సురక్షతో సమస్యలు పరిష్కారం అవుతున్నాయని..మంత్రి ఆర్కే రోజా సోదరుడు రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. వేపగుంట సచివాలయం పరిధిలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఎంపీపీ మునివేలమ్మ, ఎంపీడీవో ఇందిరమ్మ, తహశీల్దారు పరమేశ్వర స్వామి,సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం



ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు రెండో పట్టణ పరిధిలోని ఐ.టి.ఐ కళాశాలలో 2022-2023 సంవత్సరంలో ప్రవేశం కోసం మిగిలి ఉన్న రెండో విడత సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీరాములు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యర్థులు ఆన్‌లైన్‌తో దరఖాస్తు చేసుకునేందుకు %http :// iti. nic. in% వెబ్ సైట్‌లో ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెలాఖరు చివరి వరకు సమయం ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు ఆగస్టు ఒకటో తేదీరకు గూడూరు ప్రభుత్వ డి.ఎల్.టి.సి నందు ఒరిజినల్ సర్టిఫికెట్స్ తీసుకొచ్చి వెరిఫికేషన్ చేసుకోవాలని తెలిపారు.

విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీ



ప్రజాశక్తి -తొట్టంబేడు: శివనాథపురంలోని ప్రభుత్వ పాఠశాలలో 1 నుండి ఐదో తరగతి విద్యార్థులకు నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలవగుంట భరత్ రెడ్డి విద్యాసామగ్రి, మిఠాయిలను పంపిణీ చేశారు. విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి పాఠశాలకు విద్యుత్ సదుపాయం ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శైలజ, భరత్ యూత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మున్సిపల్ చైర్మన్ జన్మదిన వేడుకలు



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో శనివారం మున్సిపల్ ఛైర్మన్ ఆనంగి హరి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంత్రి ఆర్కే రోజా సోదరులు రాంప్రసాద్‌రెడ్డి పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంకుర సంస్థలకు 31 వరకు దరఖాస్తు గడువు పెంపు

ప్రజాశక్తి - క్యాంపస్: ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, తిరుపతి వ్యవసాయ ఆవిష్కరణలు, అంకుర సంస్థలకు ఈనెల 31 వరకూ అప్లికేషన్ గడువు పెంపు ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ పరిధిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానము, తిరుపతి నందు నెలకొల్పబడిన అగ్రిఇంక్యుబేటర్ సంస్థ ఆరవ బ్యాచ్ కొరకు అప్లికేషన్ గడువును ఈనెల 31 వరకూ పెంచడమైనదని సహ పరిశోధనా సంచాలకులు డాక్టర్ సి.రమణ తెలిపారు. వ్యవసాయ, దాని అనుబంధ రంగాలలో నూతన ఆవిష్కరణలతో అంకుర సంస్థలను ఏర్పాటు చేసుకోదలచిన ఔత్సాహికుల నుంచి దరఖాస్తులను మొదట ఈనెల 15వ తేదీ వరకూ ఉండగా పలువురి విన్నపాల మేరకు ఆ గడువును ఈనెల 31వ తేదీ వరకూ పొడిగిస్తున్నట్లు ఆయన తెలిపారు. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ వారి ఆర్‌కెవివై రాఫ్తార్ పథకం ద్వారా రైతుల సమస్యలకు పరిష్కారం కలిగించే దిశగా విన్నూత్న ఆలోచనలతో నూతన ఆవిష్కరణలను చేయగల ఔత్సాహికులు విద్యార్హతతో సంబంధం లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చని ఇంక్యుబేటర్ ప్రధాన అధికారి డాక్టర్ పి.బాలహుస్సేన్ రెడ్డి వెల్లడించారు. 2019లో ప్రారంభించి ఇప్పటి వరకూ 5 బ్యాచులను విజయవంతంగా పూర్తి చేసి అందులో ఎంపిక కాబడిన 56 మంది ఔత్సాహికులకు రూ.4.00కోట్ల గ్రాంటు మంజూరు కాగా మొదటివిడతగా రూ.1.42కోట్లను పంపిణీ చేశామని ఆయన తెలిపారు. ఈ అరవ బ్యాచులో వ్యవసాయంలో కానీ పశుపోషణలో కానీ చేపలు, రొయ్యల పెంపకంలో కానీ, పట్టుసాగులో కానీ, సరఫరా గొలుసు నిర్వహణలో కానీ విలువ ఆధారిత సేవలలో కానీ, ఫుడ్ ప్రాసెసింగ్ లో కానీ, వ్యవసాయ అనుబంధ రంగాలలో ఇంఫర్మేషన్ టెక్నాలజీ వినియోగం వంటి విభిన్న అంశాలలో విన్నూత్న ఆలోచనలు కలిగిన ఔత్సాహికులకు రెండు విభాగాల క్రింద ఇంక్యుబేటర్ ద్వారా సహకారం అందిస్తామని బాలహుస్సేన్ రెడ్డి తెలిపారు. అర్హత ఉన్నవారు జూలై 31వ తేదీ వరకూ www.angraura-bitpt.org వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తుదారుల అలోచనలు కమిటీ వారు పరిశీలించి ఉత్తమ అలోచనలను ఎంపిక చేసి రెండు నెలల శిక్షణకు ఎంపిక చేస్తామని తెలిపారు. 94416 70829 నెంబరులో సంప్రదించవచ్చని సూచించారు.

ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేద్దాం



ప్రజాశక్తి-వెంకటగిరి: ఈనెల 21న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన లబ్ధిదారులకు వరుసగా ఐదోసారి వైఎస్ఆర్ నేతన్న నేస్తం నిధులు జమ చేయనున్నట్లు ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి, రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. శనివారం ఉదయం వెంకటగిరిలోని నేదురుమల్లి మైదానంలోని సమావేశ మందిరంలో ముఖ్యమంత్రి పర్యటనకు విధులు కేటాయించబడిన అధికారులతో మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి సమీక్షించి దిశానిర్దేశం చేశారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ వెంకటగిరిలో ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. గత అనుభవాలను దష్టిలో ఉంచుకుని మరింత మెరుగ్గా ఏర్పాట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ అధికారులు బందోబస్తు నిర్వహణ అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో సమన్వయకర్త, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, జెడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, తిరుపతి ఎంపీ ఎం.గురుమూర్తి, ఎమ్మెల్సీ మేరుగు మురళి, చంద్రశేఖర్‌రెడ్డి, బల్లి కళ్యాణ చక్రవర్తి, ఎమ్మెల్యే లు కిలివేటి సంజీవయ్య, కోనేటి ఆదిమూలం, రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్మెంట్ బోర్డ్ ఛైర్మన్ రాంకుమార్, జేసీ డీకే బాలాజీ, గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్, ఎస్డీసీలు శ్రీనివాసులు, భాస్కర్ రెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి ఎన్ఆర్ఐల సహకారం అవసరం



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: అమెరికా పర్యటనలో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు జాతీయ పొలిట్ బ్యూరో సభ్యులు టిడి జనార్దన్, చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు పులివర్తి నాని, పశ్చిమ గోదావరి మాజీ జెడ్పీ ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, ఏపీఎన్ఆర్టీ మాజీ ఛైర్మన్ డా. రవి వేమూరులతో కలిసి నగరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ ముఖ్య అతిథులుగా ఛార్లెట్‌లో ఏర్పాటు చేసిన టీడీపీ అభిమానుల మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమం విజయవంతమైంది. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడానికి ఎన్నారైలు కషి చేయాలని కోరారు. నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో నగరి నియోజకవర్గంలో టీడీపీ గెలవడం ఖాయమని.. ఈ మేరకు తాను టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడుకు మాట ఇచ్చానని చెప్పారు.. టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ శతజయంతి వేడుకలను తెలుగు రాష్ట్రాలతోపాటు అమెరికా ఇతర దేశాల్లో ఘనంగా జరుపుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పచ్చికాల్వకు చెందిన తులసీరాం పాశం, చింతకాల్వకు చెందిన దేవా నర్రావుల, రమేష్ మూకుళ్ల, నాగ పంచుమర్తి, బాలాజీ తాతినేని, సతీష్ నాగభైరవ, ఠాగూర్ మల్లినేని, మాధురి ఏలూరి తదితరులు పాల్గొన్నారు.

మామా అల్లుళ్ల భాగోతం చాంతాడంత..!



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: టీడీపీ నేత రాంబాబు, ఆయన అల్లుడు రంగినేని చెంచయ్య నాయుడి అవినీతి భాగోతం బయటకు తీస్తే చాంతాడంత ఉంటుందని మన్నవరం వైసీపీ నేతలు విమర్శించారు. అధికారంలో ఉండగా వారు గ్రామంలో సలిపిన దౌర్జన్య కాండను రుజువులతో సహా నిరూపిస్తామని స్పష్టం చేశారు. శ్రీకాళహస్తి మండలం మన్నవరంకు చెందిన వైసీపీ నేతలు రంగినేని చెంచయ్య నాయుడు, జయరామానాయుడు, గిరి, నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, హరీష్, నరేష్, మిల్క్ సొసైటీ ఛైర్మన్ మధుసూదన్ రావు శనివారం స్థానిక ప్రెస్ క్లబ్ లో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాంబాబు నాయుడు ప్రెస్ క్లబ్ వేదికగా మామా అల్లుళ్లపై ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అక్రమ కేసులు పెట్టించాడని ఆరోపణలు చేయడం అవాస్తవమన్నారు. నమోదైన కేసులకు సంబంధించి తమ వద్ద పక్కా ఆధారాలున్నాయని స్పష్టం చేశారు. రాంబాబు తనకు తాను 'డిక్షనరీ ఆఫ్ పాలటిక్స్' అని గొప్పలు పోతున్నారనీ, కానీ ఆయన 'థీఫ్ పాలటిక్స్ ఆఫ్ డిక్షనరీ'కి మారు పేరంటూ ఎద్దేవా చేశారు.

దిశ యాప్‌పై అవగాహన తప్పనిసరి



ప్రజాశక్తి -క్యాంపస్: శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, మహిళా అధ్యయన కేంద్ర అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.ఉమాదేవి దిశ యాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని రేణిగుంటలోని స్వయం సహాయక సంఘ మహిళలకు వెలుగు ఆఫీస్ లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దిశా యాప్ ప్రతి మహిళకు ఒక భద్రత, వారికి రక్షణ మన ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని రూపొందింపజేసిన దిశా యాప్ ప్రతి మహిళ మొబైల్లో ఒక ఆయుధంలా ఉండాలని సూచించారు. మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, నేరాలు రూపుమాపేలా మహిళల భద్రతకు భరోసాను యాప్ ఇస్తుందన్నారు. ఇందులో భాగంగా ఆపదలో ఉన్న ప్రతి మహిళ అత్యవసర సాయం కోసం దిశ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఓఎస్ బటన్ నొక్కితే చాలు ఆయా ప్రాంతాల్లోని పోలీసులు అందుబాటులోకి వచ్చేలా దిశ యాప్ ప్రతి మహిళస్మార్ట్ ఫోన్లో అందుబాటులో ఉండేలా చేసిందన్నారు. దిశ యాప్‌ను ఏవిధంగా డౌన్లోడ్ చేసుకొని ఆపద సమయాల్లో ఎలా ఉపయోగించాలో తెలుపి, మహిళలకు గల సందేహాలను కూడా నివృత్తి చేశారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, మహిళా అధ్యయన కేంద్రం రీసెర్చ్ అసిస్టెంట్ డాక్టర్ ఎం.ఇంద్రాణి, మహిళలు పాల్గొన్నారు.

పంగుళూరు సీతమ్మ మార్గం ప్రారంభం



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిని అత్యాధునిక రోడ్లతో కళకళలాడే సాంస్కృతిక వైభవాన్ని చాటే పవిత్ర నగరంగా తీర్చిదిద్దనున్నట్లు తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి అన్నారు. తిరుపతి ముత్యాలరెడ్డిపల్లి వద్ద మాస్టర్ ప్లాన్ కింద 5.35కోట్ల రూపాయల అంచనాలతో నిర్మించిన 80 అడుగుల వెడల్పు రోడ్డును పంగుళూరు సీతమ్మ మార్గంగా నామకరణ చేస్తూ శనివారం ఉదయం భూమన కరుణాకర రెడ్డి ప్రారంభిచారు. ఈ సందర్భంగా ప్రజలని ఉద్దేశించి భూమన మాట్లాడారు. ఇంత మంచి రోడ్డు నిర్మాణం వెనుక చాలా కష్టం, అనేకమంది శ్రమ దాగుందన్నారు. ఈరోడ్డును ప్రారంభించ సంకల్పించిన మరుక్షణం నుంచే అనేక ఒడిదుడుకులకు లోను కావడం జరిగిందని, అడ్డుకోవాలని కూడా చూశారని వివరించారు. అయితే వీటన్నిటిని జయించి ఇంత మంచి రోడ్డు రావడానికి ప్రధాన కారణం తిరుపతి నగర డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ అని, ఈ ఆలోచన అభినయ్‌దే అన్నారు. తిరుపతి అభివద్ధిని ఆకాంక్షిస్తూ, ఈ రోడ్డు నిర్మాణానికి సహకరించిన శ్రీపంగుళూరు సీతమ్మ ట్రస్టుసభ్యులు అభినందిస్తున్నట్టు చెప్పారు. కొత్త వీధిలోని కన్యకా పరమేశ్వరి ఆలయ ధూపదీప నైవేద్యాల కోసం పంగుళూరు సీతమ్మ అనే దాత 150 సంవత్సరాల కిందట 60ఎకరాల భూమిని దాతత్వంతో ఇవ్వడం జరిగిందన్నారు. ఆమహాతల్లి పేరిట ట్రస్ట్ ఏర్పాటైందని, ఈ శుభతరుణంలో ఆ గొప్ప భక్తురాలిని ప్రతిఒక్కరు స్మరించుకోవాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. తిరుపతి నగర మేయర్ శిరీష, నగర డిప్యూటీ మేయర్ భూమన అభినయ్, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

భవిష్యత్తుకు గ్యారంటీ బస్సు యాత్ర విజయవంతం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి నియోజకవర్గంలో టీడీపీ నేతలు శనివారం నిర్వహించిన 'భవిష్యత్తుకు గ్యారంటీ చైతన్యరథం బస్సుయాత్ర' విజయవంతమైంది. ఈ యాత్రకు పోలీసులు అడుగడుగునా ఆంక్షలు విధించారు. రేణిగుంట మండలంలో వైసీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య వాగ్వాదం చోటు చేసుకుని ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. రేణిగుంట మండల కేంద్రంలో ప్రారంభమైన ఈ బస్సుయాత్ర రేణిగుంట, ఏర్పేడు, శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల్లో జరిగింది. రేణిగుంట మండలంలోని జగనన్న కాలనీ వద్ద వైసీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. చైతన్యరథం బస్సు యాత్రకు బందోబస్తు కల్పించాల్సిన పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం... అడుగడుగునా ఆంక్షలు పెట్టడం విమర్శలకు దారి తీసింది. రేణిగుంట మండలంలో అన్యాక్రాంత భూముల పరిశీలనకు పోకూడదని పోలీసులు నోటీసులు ఇచ్చినా టీడీపీ నేతలు వెనక్కు తగ్గలేదు. ఈ భూముల వద్ద వైసీపీ, టీడీపీ కార్యకర్తల నినాదాలతో కొంత ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో టీడీపీ నేతలు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీనాయుడు, సత్రవాడ మునిరామయ్య తదితరులు పాల్గొన్నారు.



గూడూరు: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ప్రకటించిన మిని మ్యానిఫెస్టోలో భాగంగా భవిషత్తుకి గ్యారెంటీ కార్యక్రమంపై, పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఈనెల 18వ తేదీన చిల్లకూరు మండలం తిరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నెలబల్లి భాస్కర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు పులిమి శ్రీనివాసరావు, కొండూరు వెంకటేశ్వర్లు రాజు, దువ్వూరు మధుసూదన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి బిల్లు చెంచురామయ్య, జలీల్ అహ్మద్, సోమిశెట్టి చెంచురామయ్య, పట్టాభిరెడ్డి, ఇశ్రాయల్ కుమార్, శివకుమార్, పెంచలయ్య, గోపాల్, మహిళలు గుండాల లీలావతి, మట్టం శ్రావణి రెడ్డి, గుండాల భారతి, సరస్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం.. ముగ్గురి అరెస్టు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పుత్తూరు టౌన్, గేటు పుత్తూరు, కేబిన్ సర్కిల్ వద్ద రహస్య సమాచారం మేరకు ముగ్గురు యువకులు గంజాయి విక్రయిస్తుండగా పుత్తూరు పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. ఇందులో అత్తికాయల విజయభాస్కర్, సాయి కుమార్, విజయ్ అలియాస్ వెట్టిల వద్ద 2 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నామని సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

బాధితులకు న్యాయం చేయాలి



ప్రజాశక్తి- తిరుపతి సిటీ: పోలీసులు, కోర్టు సిబ్బంది సమన్వయంతో పనిచేసి, బాధితులకు న్యాయం చేయాలని తిరుపతి అడిషనల్ ఎస్పీ వెంకట్రావు సిబ్బందికి సూచించారు. తిరుపతి జిల్లా ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు అదనపు ఎస్పి అడ్మిన్ వెంకట్రావు తిరుపతి జిల్లాలోని కోర్టు లైసెన్ ఆఫీసర్లు, కోర్టు కానిస్టేబుళుతో జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అదనపు ఎస్పీ ఆయన మాట్లాడుతూ కోర్టు అంటేనే ప్రజలు న్యాయ దేవాలయంగా భావిస్తారు. కాబట్టి నీతి నిజాయితీ, చిత్తశుద్ధితో అక్కడ విధులు నిర్వర్తించి బాధితులకు న్యాయం చేయవలసిన బాధ్యత మీపై ఉందన్నారు. విధుల్లో అలసత్వం ప్రదర్శించకుండా, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ నేర నిరూపణ అయ్యేవిధంగా పాటుపడి నేరస్తులకు శిక్ష పడేంత వరకు విశ్రమించరాదని సూచించారు. అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించే ప్రసక్తే లేదని, ఉక్కుపాదం మోపి శాఖాపరమైన చర్యలతో పాటు అవసరమైతే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కోర్టు లైసెన్ ఆఫీసర్లు/ కోర్టు కానిస్టేబుళ్లను హెచ్చరించారు.